మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో మాజీ వీసీ బాల మోహన్‌దాస్, ఉపాధ్యాయులు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాంప్రసాద్



కార్యక్రమంలో పాల్గొన్న గాయత్రి కళాశాల యాజమాన్యం



తెలుగుతల్లి చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న విద్యార్థులు

మధురవాడ: మాతృభాషను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం మాజీ వీసీ వి.బాలమోహన్‌దాస్ సూచించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) విశాఖ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానం కోసం మాతృభాషను, మనుగడ, ఉపాధి కోసం ఇతర భాషలను విద్యార్థులు నేర్చుకోవాలని హితవు పలికారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ సుకుమారన్ మాట్లాడుతూ మన భాష, సంస్కృతులను ప్రోత్సహిస్తూ ఇతర భాష, సంస్కృతులను గౌరవించే క్రమంలో ఈ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ కార్యదర్శి పి.శ్యామ్ సుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు, ఎ.జయప్రద, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాష గొప్పదనం తెలుసుకోవాలి

భీమునిపట్నం: మాతృభాష తెలుగు అత్యంత గొప్పదని, దాని గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సత్యసాయి సేవా ట్రస్ట్ తెలుగు రాష్ట్రాల టెక్నాలజీ ఇన్‌చార్జి ఎ.రాంప్రసాద్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు భాష ఎంతో మధురమైనదని, దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ తల్లిదండ్రులతోపాటు మాతృభాషను కూడా ఎంతో గౌరవంగా చూడాలని కోరారు. అధ్యాపకులు డాక్టర్ సీహెచ్.జ్యోతి, ఎం.రాజేశ్వరరావు, న్యాయవాది పి.భరద్వాజ్ పాల్గొన్నారు.

కొమ్మాది: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రజిని మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధిస్తే భవితకు బంగారు బాట వేసినట్లే అని, ఒక వ్యక్తిని పరిపూర్ణ మానవుడిగా, ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దే శక్తి మాతృ భాషకు ఉందన్నారు.

మాతృభాష అమ్మ వంటిది

తగరపువలస: మాతృభాష అమ్మవంటిదని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో హిందీ విద్యార్థులకు మాతృభాష ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు. భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి 21న యునెస్కోలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించి 2000 నుంచి వేడుకలు జరుపుకుంటున్నట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా పలుపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించారు. ముందుగా 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మూడు భాషల్లో చదవడం, రాయడం రావాలని సూచించారు. పఠనాభివృద్ధితో విద్యపై ఆసక్తి పెరుగుతుందన్నారు. గణితంలో అధిక మార్కులు సాధించడానికి సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం వెనుకబడిన విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు.

లక్ష్మీపురం హైస్కూల్ పరిశీలన

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం సాయంత్రం డీఈవో ఎల్.చంద్రకళ, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు సందర్శించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో సమీక్ష జరిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు సంబంధిత ఉపాధ్యాయులు ట్యాబ్‌లలో పొందుపరిచిన బైజ్యూస్ కంటెంట్‌ను ఎక్కువగా వినియోగించేలా సూచించారు.

కుల వృత్తులతో ఆర్థిక స్వావలంబన



ఇసకలపాలెంలో మిల్లు ప్రారంభిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణ

పద్మనాభం: తెలుకుల కుల బంధువులు కులవృత్తితో ఆర్థిక స్వావలంబన సాధించాలని విశాఖ నగర మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఇసకలపాలెంలో పీఎంఈజీపీ పథకం నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన నూనె మిల్లును మంగళవారం ఆయన అఖిల గాంధ్ర తెలుకుల సంక్షేమ సంఘం ట్రస్టు చైర్మన్ కల్లెపల్లి కూర్మనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పద్మనాభం మండలానికి మూడు నూనె మిల్లు యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వీటిలో ఇసకపాలెంలో ఏర్పాటు చేసిన యూనిట్ ఒకటన్నారు. ఈ యూనిట్ల ద్వారా తెలుకుల కులవృత్తిదారులు నల్ల నువ్వుల నుంచి తెల్ల నువ్వుల పప్పు తయారీ, నువ్వుల పప్పు నుంచి నూనె తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో తెలుకుల కుల సీటీ సంఘం ప్రధాన కార్యదర్శి జామి అప్పలరాజు, పద్మనాభం మండల ప్రధాన కార్యదర్శి అలమండ అప్పారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల కల్యాణం



ఉత్సవమూర్తులు

మధురవాడ: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మధురవాడ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ప్రధాన అర్చకులు దూసి రామలింగ శర్మ ఆధ్వర్యంలో కనుల పండువగా మంగళవారం నిర్వహించారు. అనంతరం మధురవాడ వీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణంలో పాల్గొని పులకించిపోయారు. కార్యక్రమంలో ధర్మకర్త నరసింహమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కోలగట్ల వీరభద్రస్వామి



శ్రీవారి సన్నిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామిని డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా అంతరాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ అర్చకులు వేదాశీర్వాదం, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో రమేష్, సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు



దుకాణదారుడితో మాట్లాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్

మధురవాడ: ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించినందున ఎవరైనా వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ 5వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ హెచ్చరించారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం వార్డులోని మధురవాడ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై సచివాలయ కార్యదర్శులతో కలిసి అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ వాడుతున్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ 4 కిలోల పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుని రూ.6 వేలు అపరాధ రుసుం వసూలు చేశారు.

త్వరలో తీరంలో వెలుగులు



కొలతలు తీసుకుంటున్న జీవీఎంసీ సిబ్బంది

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తీర ప్రాంతాలకు త్వరలో వెలుగులు రానున్నాయి. బీచ్‌రోడ్డు వెంబడి నగరం నుంచి తొట్లకొండ వరకు మాత్రమే సెంట్రల్ లైటింగ్ ఉంది. అక్కడి నుంచి భీమిలి వెళ్లాలంటే రాత్రి సమయాల్లో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పేవి కావు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు సెంట్రల్ లైటింగు కోసం దరఖాస్తు చేసినా అధికారులు పట్టించుకోలేదు. అయితే ప్రస్తుతం ఆ సమస్య త్వరలోనే తీరనుంది. తొట్లకొండ నుంచి భీమిలి బీచ్‌రోడ్డు జగ్గారావు తోట వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. జీ 20 సదస్సు నేపథ్యంలో సుందరీకరణలో భాగంగా రూ.5.67 కోట్ల జీవీఎంసీ నిధులతో సెంట్రల్ లైటింగ్, డివైడర్ ప్యాచ్ వర్క్‌లు, పెయింటింగ్స్ శరవేగంగా కొనసాగుతున్నాయి.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



క్లబ్ తరపున అందిస్తున్న ట్రాక్ షూట్లు, జెర్సీలతో క్రీడాకారులు, నాయకులు

తగరపువలస: చిట్టివలసకు చెందిన ఆర్ అండ్ బీ విశ్రాంత డీఈఈ శొంఠ్యాన గురునాథరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బాబా చక్రవర్తి అంబేడ్కర్ మంగళవారం ఫుట్‌బాల్ క్రీడాకారులకు రూ.35 వేల విలువైన ట్రాక్ షూట్లు, జెర్సీలు అందించారు. చిట్టివలస బంతాట మైదానంలో వీటిని పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన సబ్ జూనియర్స్‌కు క్లబ్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు ఎ.జగన్నాథరావు, ఎం.రాజారావు, ఎం.రాంజీ, పందిరి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది బోర సూర్యప్రకాష్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు శొంఠ్యాన జడ్సన్ రాబర్ట్‌సన్, బోర చిన్నారెడ్డి, మోసెస్, కంతిమహంతి మహేష్, నమ్మి రాము, పందిరి విజయ్, శివ, క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ రైస్ మిల్లులో బియ్యంపై విచారణ

పద్మనాభం: అనంతవరంలోని శ్రీ గణేష్ మోడరన్ రైస్ మిల్లులో బియ్యంపై రెవెన్యూ అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ మిల్లులో ఈ నెల 15న బియ్యం లోడుతో ఉన్న లారీని తహసీల్దార్ కోరాడ వేణుగోపాలరావు ఆదేశాలను బేఖాతరు చేసి సీఎస్ డీటీ శ్యామల, మద్ది వీఆర్వో ఉమామహేశ్వరరావు వదిలేశారు. దీంతో వారిద్దరినీ కలెక్టర్ మల్లికార్జున సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. బియ్యం శ్యాంపిల్‌ను విశాఖపట్నం ల్యాబ్‌కు పంపగా అవి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించినట్టు సమాచారం. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాష్, తహసీల్దార్ వేణుగోపాలరావు ఈ నెల 16, 17 తేదీల్లో మిల్లులో నిల్వ ఉన్న 20 టన్నుల బియ్యంపై విచారణ చేపట్టారు. అవి పీడీఎస్ బియ్యంగా అనుమానం రావడంతో సీజ్ చేశారు. ఈ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

సుధాకర్ నామినేషన్‌కు తరలిరండి

తగరపువలస: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ బుధవారం నామినేషన్ వేయనున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తరలిరావాలని ఆ పార్టీ భీమిలి మండల అధ్యక్షుడు గాడు శ్రీను కోరారు. ఉదయం 10 గంటలకు రుషికొండ బీచ్ ఎ – 1 గ్రాండ్ నుంచి కలెక్టరేట్‌కు బయలుదేరాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థి గిద్దలూరు విజయకుమార్ మంగళవారం తగరపువలసలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి రవీంద్ర పాఠశాలలో ఎన్నికల మ్యానిఫెస్టోను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ మిథిలాపురి వుడా కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎన్‌జీజీవోస్ కాలనీ, చంద్రంపాలెం, సుద్దగెడ్డ, వాంబేకాలనీ, పోర్టు కాలనీ, శ్రీనివాస్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొమ్మాది: లా కాలేజీ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో గల వివేకానందనగర్, సిరిగుడినగర్, ఎండాడ పెట్రోల్ బంక్ వెనుక వైపు, దసపల్లా లే అవుట్ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రాజేష్ తెలిపారు.

టిడ్కో డీడీల అందజేత



మధురవాడ జోనల్ కార్యాలయంలో వివరాలు పరిశీలిస్తున్న సిబ్బంది

మధురవాడ: గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల కోసం ప్రజల నుంచి వసూలు చేసిన డీడీలను కొంత మందికి జీవీఎంసీ వెనక్కి ఇచ్చేస్తోంది. ఈ క్రమంలో మధురవాడ జోనల్ కార్యాలయంలో మంగళవారం పలువురు లబ్ధిదారులు భారీగా క్యూ కట్టారు. జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం వచ్చిన వారు, పథకంలో అనర్హులుగా తేలిన వారికి డీడీలు వెనక్కి ఇస్తున్నారు. ఇంటి స్థలం వచ్చిన వారు ఈ రూ.25 వేలుకి మరో రూ.10 వేలు కలిపి హౌసింగ్ స్కీము ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారుని వాటాగా చెల్లించుకోవడానికి వీలు కలుగుతుంది. జీవీఎంసీ జోన్ – 2లోని 9 వార్డుల్లో 2 వేల మందిని గుర్తించారు. వీరికి రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు డీడీలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

పద్మనాభం: కేంద్ర ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్ అర్బన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు మోర్త రమణ డిమాండ్ చేశారు. పద్మనాభంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీలను వర్గీకరిస్తామని హామీ ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినప్పటికీ నెరవేర్చలేదన్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ కమిటీలు మాత్రమే పని చేస్తాయన్నారు. పాత కమిటీలు పూర్తిగా రద్దయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ములపర్తి పైడిరాజు, ప్రచార కార్యదర్శిగా ములపర్తి శంకర్‌ను నియమించారు. పద్మనాభం మండల అధ్యక్షుడిగా కడితి ఈశ్వరరావు, ఉపాధ్యక్షునిగా దేవరపల్లి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా సత్యాల అప్పారావు, ఆనందపురం మండల అధ్యక్షునిగా మారడబూడి అప్పారావు, ఉపాధ్యక్షునిగా లెంక పైడిరాజును నియమించారు. ఈ సందర్భంగా వీరు రెడ్డిపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



స్థానికులతో మాట్లాడుతున్న జెడ్పీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే వ్యాధులు దరి చేరవని జోన్ – 1 కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పాత పరదేశిపాలెంలో మంగళవారం ఆయన పర్యటించారు. డ్రైనేజీలు, రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని శానిటరీ వర్కర్లకు సూచించారు. నివాసాల మధ్య చెత్త వేయకుండా వాహనం వచ్చినప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు, కన్వీనర్ సాడి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణకు చర్యలు



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న శాంతి

ఆనందపురం : మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలను ఆరోగ్య సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రాల పరిశీలనాధికారి శాంతి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ఆరోగ్య కేంద్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాన్యులకు కూడా ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో అందాలనే ఉద్దేశంతో వెల్‌నెస్ సెంటర్లు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండి, మాతా శిశు సంరక్షణపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్త పరీక్షలు చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య అధికారిణి ఉమావతి, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె.శైలజ, నళిని తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మాణ పనులు పూర్తి



రక్షణ గోడ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేట వద్ద రూ.74 లక్షలతో చేపట్టిన రక్షణ గోడ నిర్మాణ పనులు మూడు వారాల్లోనే పూర్తయ్యాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు కూలిన పాత రక్షణ గోడ స్థానంలో కొత్తది నిర్మించారు. ఆరు మీటర్ల పొడవు, 22 మీటర్ల వెడల్పుతో చేపట్టిన పనులు మంగళవారం చివరి దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో రక్షణ గోడ నిర్మాణానికి సహకరించిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఇక్కడి ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో తెడ్లాపు అప్పలరాజు, సరగడ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిటు కార్యాలయంలో రెడ్‌బుక్ డే



రెడ్‌బుక్ డే కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

తగరపువలస: భీమిలి సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస సిటు కార్యాలయంలో మంగళవారం రెడ్‌బుక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ రచన మహాప్రస్థానం పుస్తకాన్ని చదివారు. ఆ పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ శ్రీశ్రీ అభ్యుదయ రచనలు యువతకు మార్గదర్శకంగా ఉండేవన్నారు. నేటి యువతను కూడా మంచిమార్గంలో నడిపించడానికి ఈ రచనలు అవసరమన్నారు. శ్రీశ్రీ రచించిన ప్రతి పుస్తకం ప్రస్తుత యువత చదవాలన్నారు. కార్యక్రమంలో రవ్వ నరసింగరావు, భాగం లక్ష్మి, కె.నాగరాణి, ఎస్.అప్పలనాయుడు, బత్తుల నరసింగరావు, కె.రాము, సోమి వెంకట్, పవన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సమాజహితానికి పరిశోధనలు



భట్నాగర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కొమ్మాది: సమాజహితానికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు ఉపయోగపడాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బాలా కుమార్ అన్నారు. సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ 129వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వర్సిటీలో మంగళవారం నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశం విజ్ఞాన శాస్త్రరంగంలో అభివృద్ధి చెందడానికి సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి పరిశోధకుల దూర దృష్టి కారణమన్నారు.

విద్యుత్ స్తంభంతో ప్రమాదాలు



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

ఆనందపురం : ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. దీంతో ఇక్కడ ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి విద్యుత్ సబ్ స్టేషన్, మండల విద్యా వనరుల కేంద్రం మీదుగా పెందుర్తి – ఆనందపురం రోడ్డు వరకూ సిమ్మెంట్ రోడ్డు నిర్మించారు. కాగా సిమ్మెంట్ రోడ్డు పెందుర్తి – ఆనందపురం రోడ్డుకు కలిసే చోట మధ్యలో విద్యుత్ స్తంభం ఉంది. దీంతో వాహనాలు అక్కడకు చేరుకునే సరికి రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని పక్కకు మార్చాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు చేపలుప్పాడ – పుక్కళ్లపాలెంలో తనకు ఉన్న స్థలంలోనే ఇంటి నిర్మాణం చేపడుతున్నట్టు మత్స్యకార నాయకుడు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మారుపల్లి అమరనాథ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు పూర్వం నుంచి ఇక్కడ 1296 గజాల స్థలంలో ఇల్లు ఉండేదన్నారు. ఇల్లు శిథిలం కావడంతో కూలిచ్చేసి ప్రస్తుతం 1088 గజాల్లో ఇంటి నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు తీసుకున్నామన్నారు. ఇంకా 208 గజాల స్థలం మిగిలి ఉందన్నారు. ఇంటి ముందు పది అడుగుల రహదారికిగాను ప్రస్తుతం పన్నెండున్నర అడుగులు వదిలినట్టు తెలిపారు. వెంకటరమణ అనే వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ఫిర్యాదు చేసినట్టు ఆయన ఆరోపించారు. తన వద్ద ఉన్న రికార్డుల ప్రకారం అతనిపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

బీచ్ ప్రొఫైలింగ్‌పై వర్క్‌షాప్

కొమ్మాది: భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవల కేంద్రం (ఇన్‌కాయిస్) ఆధ్వర్యంలో సాగర్‌నగర్ బీచ్‌లో బీచ్ ప్రొఫైలింగ్‌పై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ ప్రొఫైలింగ్‌లో భాగంగా బీచ్ సాధారణ స్థలాకృతి, తరంగాలు, ప్రవాహంపై ఎలా సర్వే చేయాలో వివరించారు.